బీసీ బంద్ ప్రశాంతం


బస్సులు లేక వెలవెలబోతున్న దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్

- డిపోలకే పరిమితమైన బస్సుల
- ధర్నాలు, రాస్తారోకోలతో స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన డిమాండ్‌తో బీసీ ఐకాసా పిలుపు మేరకు శనివారం నిర్వహించిన బంద్ విజయవంతం అయినట్లు ఆయా పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు ఉదయం నుంచే రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. బస్సు డిపోల్లో నుంచి బస్సులు రాకుండా కట్టడి చేశారు. దుకాణాలు, విద్యాసంస్థలను మూసివేయించారు. బస్సులు లేకపోవడంతో వివిధ ప్రాంతాల వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆయా బస్సు డిపోల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


దిల్‌సుఖ్‌నగర్‌లో రోడ్డు పై బైఠాయించిన నాయకులు


మలక్‌పేటలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఐఎస్‌సదన్‌లో నిరసనలో పాల్గొన్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్


దిల్‌సుఖ్‌నగర్ డిపోలో బస్సులు


దిల్‌సుఖ్‌నగర్‌లో బస్సులను అడ్డుకుంటున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు


దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో ముందు ధర్నా చేస్తున్న బీసీ ఐకాస, కాంగ్రెస్ నాయకులు


బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపోల ముందు ధర్నాలో పాల్గొన్న మాస్ వ్యవస్థాపకులు కటకం నర్సింగ్‌రావు


బండ్లగూడ డిపో వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీసీపీ అనురాధ


నాగోలులో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు


ఎల్‌బీనగర్‌లో బంద్ సందర్భంగా ట్రాఫిక్ జామ్


ధర్నా చేస్తున్న నాయకులను అదుపులోకి తీసుకుంటున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య


నాగోలులో నిరసన వ్యక్తం తెలుపుతున్న సీపీఐ పార్టీ నాయకులు, బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు


ఆటోనగర్ వద్ద రాస్తారోకో చేస్తున్న బీసీ నాయకులు, లారీ యజమానుల సంఘం నాయకులు


బీసీ ఐక్యవేదిక, టీఆర్‌పీ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో బీసీ బంద్‌లో మల్లికార్జున్

క్లుప్తంగా

బహుమతుల ప్రదానం


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

వనస్థలిపురం: ఢిల్లీలో ఈ నెల 6న జరిగిన 12వ ఏహెచ్‌పీఎస్ మెగా కాంపిటీషన్స్‌లో తమ విద్యార్థులు సత్తా చాటారని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. వనస్థలిపురం బ్రాంచి నుంచి 25 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..


పిడమర్తి నరేష్

మలక్‌పేట: దీపావళి సందర్భంగా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి బాణాసంచా విక్రయించే వారు భద్రతా ఏర్పాట్లలో హద్దులు మీరితే చర్యలు తప్పవని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని, తాత్కాలిక దుకాణాలను షీట్స్(రేకులు)తో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన కరెంట్ తీగలు మాత్రమే వాడాలని, తడకలు, బట్టలు వాడరాదన్నారు. షెడ్ వద్ద నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాణాసంచా సామగ్రి జప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

కార్పొరేటర్‌కు వినతి


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు


ఎల్‌బీనగర్: గాయత్రీనగర్ ఫేజ్-2 కాలనీ అభివృద్ధికితన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. కాలనీ నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా కాలనీ సమస్యలపై కార్పొరేటర్ లచ్చిరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సమస్య పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీలో మట్టి రోడ్లతో ఇబ్బందులు పుతున్నామని నూతన రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.వినతి ఇచ్చిన వారిలో చందు నాయక్, వంశీకృష్ణ, శరత్‌బాబు, నవీన్‌కుమార్, సుధాకర్, గణేష్‌యాదవ్,బాలకృష్ణ, ఖాజాహుస్సేన్ ఉన్నారు.

అక్రమ మద్యాన్ని అరికట్టండి


ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: సింగరేణి కాలనీలో అక్రమ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఐఎస్ సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. శనివారం ఆయన పలువురు నాయకులతో కలిసి సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలో రాత్రీ పగలు తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారని కొందరు గంజాయి విక్రేతలుగా మారి ఇక్కడి యువతను చెడు వ్యసనాలకు అలవాటు చేస్తున్నారన్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ రావు, సక్రిబాయ్, అంజయ్య పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం సరికాదు


వరద కాలువను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలో నెలకొన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆటోనగర్ నుంచి డబుల్ బెడ్రూమ్ సముదాయాల వరకు నిర్మించిన వరదకాలువల్లో వ్యర్థాలు, డ్రైనేజీ మురుగు పారుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన నాలాను పరిశీలించి మాట్లాడారు. వరదకాలువలో అక్రమంగా కలిపిన డ్రైనేజీ లైన్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ పరిధి శివంహిల్స్, వీరన్నగుట్ట, కేవీఎస్‌రెడ్డినగర్‌లో విద్యుత్ అధికారులు నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మిర్జావుద్దీన్, సిబ్బంది, ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి


ట్రోఫీ అందుకున్న విద్యార్థులు

సైదాబాద్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎస్‌పీడీ సమగ్ర శిక్ష తెలంగాణ, నటరాజ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన తెలంగాణ సీఎం డ్యాన్స్ కప్-2025ను శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం గెలుచుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 పాఠశాలలు ఫైనల్‌కు చేరుకోగా 150 మంది శ్రీత్రివేణి పాఠశాల విద్యార్థుల బృందం చక్కటి ప్రదర్శనతో ట్రోఫీని సొంతం చేసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులతో కలిసి 8 అడుగుల భారీ ట్రోఫీని అందుకున్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, సరూర్‌నగర్ శాఖ ప్రిన్సిపాల్ యోగేశ్వరీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులను నియమించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మన్సూరాబాద్: రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అంత వరకు విద్యార్థులు రోడ్డు దాటేందుకు వారికి సహాయం చేసేందుకు ట్రాఫిక్ పోలీసులకు నియమించాలని బీఆర్‌ఎస్ నేత మామిడి రాంచందర్, కాంగ్రెస్ నేత జోగు రాములు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శనివారం అడిషినల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని రెండ్రోజుల క్రితం బస్తీకి చెందిన విద్యార్థి తల్లి రోడ్డు దాటుతుండగా బస్సు ప్రమాదానికి గురై మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయ్యేంత వరకు పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు.

తొలగించారు.. వదిలేశారు


నరికిన చెట్లను రోడ్లపైనే ఉంచిన దృశ్యం

ఎల్‌బీనగర్: విద్యుత్ తీగలకు తగులుతున్నాయని తొలగిస్తున్న చెట్ల కొమ్మలను తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజుల తరబడి రోడ్డు, రహదారులపై పక్కనే పేరుకుపోతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు తొలగించడమే మా పని అని విద్యుత్‌శాఖ, తరలించడం మా పని కాదని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతుండటంతో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇరు శాఖల నడుమ సమన్వయం లేకపోవడం కాలనీవాసులు శాపంగా మారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తొలగించిన కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

నేడు డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌పై అవగాహన

మన్సూరాబాద్: బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరిణి వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ గేటు వద్ద ఆదివారం ఉదయం డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉదయం 7 గంటలకు అవగాహక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ హాజరవుతారని కాలనీవాసులు, వాకర్స్ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


కాలువ పనులకు శంకుస్థాపనలో మధుసూదన్‌రెడ్డితో ఈఓ లావణ్య

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆలయ ప్రాంణంలో రూ. 8 లక్షలతో ప్రారంభించనున్న వరదనీటి కాలువ పనులకు ఆలయ ఈఓ లావణ్య, చైర్మన్ సత్యనారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఆలయం చుట్టూ సీసీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్, కోనేరు ఆధునీకరణ, రేకుల షెడ్స్, అర్జిత సేవలకు ఆన్‌లైన్ చెల్లింపులు వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, దశరథగౌడ్, ఆలయ పాలక మండలి సభ్యులు శ్రీనివాస్, సంతోష్ కుమార్, కిరణ్‌కుమార్, ఎనుముల రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అంబాప్రసాద్ పాల్గొన్నారు.అనంతరం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం అందజేసిన దాతలు ముఖేష్‌కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సుధీర్, శివకుమార్‌కు ఆలయ ఈఓ లావణ్య చేతుల మీదుగా డోనర్ కార్డులను అందజేశారు.

సదర్‌కు రావాలని ఆహ్వానం


కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

చంచల్‌గూడ: దీపావళి పురస్కరించుకుని ఈ నెల 21న ఉప్పరిగూడ యాదవ సంఘం చంచల్‌గూడలో నిర్వహిస్తున్న సదర్ మేళాకు హాజరు కావాలని శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి సంఘం నాయకులు ఆహ్వానించారు. మేళాలకు తప్పకుండా వస్తామని చెప్పినట్లు సంఘం ప్రతినిధి నిరంజన్‌యాదవ్ తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేడుకలను రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

కార్మికురాలిని వేధించిన సూపర్‌వైజర్‌పై కేసు

చంచల్‌గూడ: మహిళను లైంగిక వేధింపులకు గురిచేసిన జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్‌పై మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రెయిన్‌బజార్ ప్రాంతంలో పారిశుద్ధ్య విభాగం కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళను శానిటేషన్ సూపర్‌వైజర్ నరసింహా తరచూ లైంగిక వేధింపులకు పాల్పడటంతో ఆమె నరసింహా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా నరసింహా కుటుంబ సభ్యులు ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పార్కింగ్ చేసిన ఆటోచోరీ

చంచల్‌గూడ: ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో చోరీకి గురైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు మహ్మద్ షోహేల్ (45) నూర్ మసీదు వద్దనున్న తన ఇంటి ముందు ఆటో టీఎస్12యూబీ6826ను పార్క్ చేశాడు. గురువారం వచ్చి చూడగా ఆటో కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూలతోట ప్రాంతంలో రోడ్డుపై పార్క్ చేసి ఉన్న ఆటోలోని బ్యాటరీ సైతం చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.